
andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
శుక్రవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 29.6 : కనిష్ఠం 24.8
నిర్మల్ జిల్లా వార్తలు
8
శనివారం 3 ఆగస్టు 2024



డి1 అక్రమాలపై కలెక్టర్ కన్నెర్ర



అక్రమ డీ-1 పట్టాలకు వ్యతిరేకంగా జిల్లా కలెక్టరేట్‌లో ఆందోళన చేస్తున్న సిద్దిలకుంట గ్రామస్థులు, అడిషనల్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం (ఫైల్)

- మరోసారి విచారణకు రంగం సిద్ధం
- డీఆర్‌ఓ, ఏడీలతో సమీక్ష
- తప్పుడు సేత్వారీలు, ఫైళ్లపై సీరియస్
- ఇంటి దొంగలపై నజర్
- బీజేఎల్పీ నేత మహేశ్వర్ రెడ్డి ఆందోళనతోనే

నిర్మల్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో కోట్ల రూపాయల విలువైన సర్కారు భూముల వ్యవహారంలో డి-1 పట్టాల పేరిట జరిగిన అక్రమాలపై ప్రస్తుత కలెక్టర్ అభిలాష అభినవ్ సీరియస్‌గా వ్యవహరిస్తున్నారు. జిల్లాలోని పలు మండలాల్లో అప్పటి కొంతమంది రాజకీయ నాయకులతో పాటు అధికారులు, సిబ్బంది కుమ్మక్కై కోట్ల రూపాయల విలువైన సర్కారు భూములను స్వాహా చేసినట్లు ఫిర్యాదులు వెల్లువెత్తాయి. డి-1 పట్టాల అక్రమాలపై బీజేఎల్పీ నేత ఏలేటీ మహేశ్వర్‌రెడ్డి సైతం అప్పటి కలెక్టర్‌కు, రాష్ట్రస్థాయి అధికారులకు స్వయంగా ఫిర్యాదు చేసి విచారణతో పాటు చర్యలు తీసుకోవాలంటూ కోరిన సంగతి తెలిసిందే. ఈ పరిణామంతో అప్పటి కలెక్టర్ అశిష్‌సంగ్వాన్ పూర్తిస్థాయిలో విచారణకు ఆదేశించారు. దీంతో పాటు ఇక్కడి సర్వే అండ్ ల్యాండ్ రికార్ఢ్స్ ఏడీ కార్యాలయంలోని డి-1 పట్టాలు, సేత్వారీలకు సంబంధించిన ఫైళ్లను స్వాధీనం చేసుకొని విచారణ చేపట్టారు. విచారణ కోసం కొంతమంది తహసీల్దార్ స్థాయి అధికారులకు ప్రత్యేకంగా నియమించి ఫైళ్ల వెరిఫికేషన్‌ను చేపట్టారు. డి-1 పట్టాలు జారీ చేసే ఎస్సారెస్పీ డిప్యూటీ కలెక్టర్ కార్యాలయంలో సైతం కొంతమంది అధికారులను నియమించి విచారణ జరిపించారు. దీంతో పాటు అప్పటి రెవెన్యూ విజిలెన్స్ విభాగంలో, ఇంటలిజెన్స్ అధికారులు డి-1, సేత్వారీల అక్రమాలపై దృష్టి కేంద్రీకరించారు. విచారణకు సంబందించి పూర్తి నివేదికలు రూపొందినప్పటికి రాజకీయ కారణాలతో అక్రమార్కులపై ఎలాంటి చర్యలు తీసుకోలేదన్న వాదనలు వెల్లువెత్తాయి. అంతలోనే కలెక్టర్ బదిలీ కావడంతో ఈ వ్యవహారం తాత్కలికంగా సద్దుమణిగింది. దీంతో అవకతవకలకు పాల్పడిన రాజకీయ పార్టీల నేతలు, అలాగే సంబంధిత అధికారులంతా సంబురపడ్డారు. అప్పట్లో ఇక్కడి సర్వే అండ్ ల్యాండ్ రికార్ఢ్స్ కార్యాలయంలోని ఓ అధికారితో పాటు కొంతమంది సిబ్బంది ప్రధాన సూత్రధారులుగా అప్పటి కలెక్టర్ అశిష్ సంగ్వాన్ గుర్తించారు. అయితే ఆయన బదిలీ కారణంగా ఈ వ్యవహారమంతా వెనకబడిపోయిందన్న వాదనలు తలెత్తాయి. ఈ వాదనలకు బలం చేకూర్చే విధంగా చర్యలు సైతం ఇప్పటి వరకు మొదలుకాలేదు. అయితే ఈ క్రమంలోనే మరోసారి బదిలీల పర్వం తెరపైకి రావడం అక్రమార్కులకు కలిసి వచ్చినట్లయిందని చెబుతున్నారు. అక్రమాల విచారణను తొక్కి పెట్టేందుకు ఈ బదిలీలను అస్త్రంగా మలుచుకోవాలని అప్పట్లో అవకతవకలకు పాల్పడిన కొంతమంది రాజకీయ నేతలు అలాగే భూకబ్జాదారులు ప్రణాళికలు రూపొందించారు. రాజకీయ పలుకుబడితో తమ మాట వినే అధికారులు సిబ్బందిని జిల్లాకు రప్పించే ప్రయత్నాలు మొదలుపెట్టారన్న ఆరోపణలున్నాయి. అయితే ఈ నేపథ్యంలో కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన అభిలాష అభినవ్ గత కొద్దిటరోజుల నుంచి ఒక్కో శాఖపై సుదీర్ఘ సమీక్షలు చేసి అక్రమాలపై అప్పటి కలెక్టర్ రూపొంటదించిన నివేదికలను నిశితంగా సమీక్షించారు. డి-1 పట్టాలు, సేత్వారీల జారీలో పెద్ద ఎత్తున అక్రమాలు జరిగినట్లు అలాగే ఈ వ్యవహారంలో సంబంధిత శాఖలకు చెందిన అధికారులు, సిబ్బంది ప్రమేయం ఉన్నట్లు నిర్ధారించుకున్నారు. దీనికి అనుగుణంగానే కలెక్టర్ గత రెండు రోజుల నుంచి బోగస్ డి-1 పట్టాలు, సేత్వారీల వ్యవహారంపై దృష్టి సారించి మరోసారి లోతుగా విచారణ జరపడమే కాకుండా అక్రమార్కులపై కఠినచర్యలు తీసుకునేందుకు సిద్దమవుతుండడం మరోసారి కలకలం రేపబోతోంది.

బీజేఎల్పీ నేత మహేశ్వర్ రెడ్డి ఆందోళనతోనే..

నిర్మల్ జిల్లాలో 2014 సంవత్సరం నుంచి 2018 సంవత్సరం వరకు కోట్ల రూపాయలు విలువ చేసే ప్రభుత్వ భూముల స్వాహాపై మొట్ట మొదట బీజేఎల్పీ నేత ఏలేటీ మహేశ్వర్‌రెడ్డి గళమెత్తడమే కాకుండా అక్రమాలను ఆధారాలతో సహా బయటపెట్టి దుమారం రేపారు. అప్పటి ప్రభుత్వంలో మంత్రిగా పని చేసిన నేత కుటుంబసభ్యులతో పాటు అప్పటి అధికార పార్టీ నాయకుల ప్రమేయం ఉన్నట్లు సైతం ఆయన ఆరోపించారు. అలాగే ఈ వ్యవహారంపై జిల్లా కలెక్టర్‌కే కాకుండా రాష్ట్రస్థాయి అధికారులందరికీ ఫిర్యాదులు చేశారు. దీంతో పాటు అటు ఇంటలిజెన్స్‌కు ఇటు విజిలెన్స్‌కు సైతం ఫిర్యాదు చేసి చర్యలు తీసుకోవాలంటూ కోరారు. కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమానికి సైతం పిలుపునిచ్చారు. ఇటీవల కూడా ఆయన డి-1 పట్టాల అక్రమాలపై మళ్లీ గళమెత్తి విచారణ జరపాలంటూ కూడా డిమాండ్ చేశారు. మహేశ్వర్ రెడ్డి ఆరోపణల కారణంగానే డి-1 పట్టాలు, సేత్వారీల అక్రమాల వ్యవహారం వెలుగులోకి వచ్చినట్లయ్యిందన్నది బహిరంగ సత్యమే.

రంగంలోకి ఇక కొత్త కలెక్టర్

ఇదిలా ఉండగా ఇటీవల కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన అభిలాష అభినవ్ అన్ని శాఖలపై సీరియస్‌గా సమీక్షలు జరుపుతున్నారు. క్రమంగా కలెక్టర్ అన్ని శాఖలపై సమీక్షలు పూర్తి చేసిన తరువాత ఇటీవలే డి-1 పట్టాల అక్రమాలు, సేత్వారీల జారీలో జరిగిన అవకతవకలపై దృష్టి కేంద్రీకరించడం కలకలానికి కారణమవుతోందంటున్నారు. గత కలెక్టర్ అశిష్ సంగ్వాన్ రూపొందించిన నివేదికలను ఆమె లోతుగా అధ్యయనం చేసి మరోసారి తన స్థాయిలో విచారణ జరిపేందుకే కాకుండా సీరియస్‌గా కఠిన చర్యలు తీసుకునేందుకు సిద్ధమవుతున్నారు. ఈ మేరకు ఆమె డీఆర్‌ఓ, ఏడీతో సమీక్ష జరిపి పూర్తి నివేదికలు అందించాలని ఆదేశించడం ప్రాధాన్యతను సంతరించుకుంటోంది.

ఇంటి దొంగలపై నజర్..

ఇదిలా ఉండగా డి-1 పట్టాలు, సేత్వారీల జారీ వ్యవహారంలో కొంత మంది సంబంధిత శాఖ అధికారుల ప్రమేయం ఉన్నట్లు పెద్ద ఎత్తున ఆరోపణలు వచ్చిన సంగతి తెలిసిందే. అప్పటి ఓ అధికారితో పాటు ఇద్దరు సిబ్బంది ఈ వ్యవహారంలో కీలకపాత్ర వహించారన్నది అటు రెవెన్యూవర్గంలోనూ ఇటు సర్వే అండ్ ల్యాండ్ రికార్ఢ్స్ శాఖలో బహిరంగ రహస్యమే. అయితే వీరూ తమకున్న రాజకీయ పలుకుబడి, పరపతితో ఫైళ్ళను తారుమారు చేయడమే కాకుండా విచారణను సైతం పక్కదోవ పట్టించేందుకు ప్రయత్నాలు చేశారంటున్నారు. ఇప్పటికి ఇద్దరు సిబ్బంది ఈ వ్యవహారంలో బహిరంగంగానే చక్రం తిప్పుతున్నట్లు కూడా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నకిలీ డి-1 పట్టాలు, సేత్వారీలతో పెద్ద మొత్తంలో సర్కారు భూములకు గండి కొట్టిన వీరు కోట్ల రూపాయలను అక్రమంగా ఆర్జించినట్లు విమర్శలున్నాయి. డి-1 పట్టా, సేత్వారీల వ్యవహారంలో తిలాపాపం తలా పిడికేడు అన్న చందంగా ఇటు కొంతమంది అధికారులు, సిబ్బందితో పాటు అప్పటి బీఆర్ఎస్ పార్టీ నేతలు, కొంత మంది రాజకీయ నేతల ప్రమేయం ఉన్నట్లు కూడా ఆరోపణలున్నాయి.

అక్రమాలపై చర్యలు తప్పవు..

డి-1 పట్టాలు, సేత్వారీల జారీలో జరిగిన అక్రమాలపై మరోసారి విచారణ జరుపుతాం. అక్రమాలకు పాల్పడిన వారందరిపై కఠినచర్యలు తీసుకుంటాం. ఈ వ్యవహారంలో ఆరోపణలున్న అధికారులు, సిబ్బందిపై విచారణ జరిపి చర్యలు చేపడతాం. జిల్లాలో భూ ఆక్రమణలు, కబ్జాలకు పాల్పడే వారిని వదిలిపెట్టం. ప్రభుత్వ భూముల రక్షణకు పకడ్బందీ చర్యలు తీసుకుంటాం.

- అభిలాష అభినవ్, జిల్లా కలెక్టర్

విఠలేశ్వరాలయంలో ఆలయ హుండీ లెక్కింపు



హుండీ లెక్కిస్తున్న భక్తులు

కుభీర్, ఆగస్టు 2 : మండల కేంద్రం కుభీర్‌లోని శ్రీ విఠలేశ్వర ఆలయ హుండీ లెక్కింపు కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ఆలయ కమిటీ అధ్యక్షులు బి. పెంటాజీ తెలిపారు. ఈ హుండి లెక్కింపులో భక్తులు సమర్పించిన రూ. 31,170 ఆదాయం సమకూరినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ఉపాధ్యక్షులు సూది రాజన్న, కే. సాయినాథ్, పి. సతీష్, ఆర్ వాసు, జీవన్, శ్రీకర్, ముత్యమ్, దత్తు, సునీల్, ఉన్నారు.

రైతులకు స్వామిజీ చేయూత

- నీటి పథకం మరమ్మతులకు రూ. 50 వేల ఆర్థిక సహాయం



ఆర్థిక సహాయం అందిస్తున్న స్వామిజీ

బాసర, ఆగస్టు, 2 : సాగునీటి పథకం మరమ్మత్తులు కోసం అవసరమైన నిధులు సమకూర్చి తనవంతు సహాయం అందించారు. బాసరలో ఓ స్వామిజీ. బాసర గోదావరి నదిపై గల ఎత్తిపోతల పథకంలో మోటార్లు చెడిపోయాయి. మరమ్మత్తులకు నిధులు అవసరం ఏర్పడింది. ఈ విషయం స్థానికుల ద్వారా తెలుసుకున్న స్థానిక వేద భారతి పీఠ స్వామిజీ విద్యానందగిరి రైతులకు రూ. 50 వేలు సహాయం చేసేందుకు ముందుకు వచ్చారు. ఈ మొత్తాన్ని శుక్రవారం రైతులకు స్వామిజీ అందించారు. ప్రతి సంవత్సరం రూ.లక్ష వరకు ఆర్థిక సాయం చేస్తానని స్వామిజీ హామీ ఇచ్చారు. అన్నం పెట్టే రైతులు బాగుంటేనే అందరు క్షేమంగా ఉంటారని వ్యాఖ్యానించారు. ఆర్థిక సాయం అందించిన స్వామిజీకి రైతులందరూ కృతజ్ఞతలు తెలిపారు.

ప్రధాని మోదీ, మందకృష్ణ మాదిగ చిత్రపటాలకు క్షీరాభిషేకం

కుభీర్, ఆగస్టు 2 : మండల కేంద్రం కుభీర్‌లో శుక్రవారం బీజేపీ నాయకులు ప్రధాని మోడి, మందకృష్ణ మాదిగ చిత్రపటాలకు క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ మండల అధ్యక్షుడు ఏశాల దత్తాత్రి మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణకు సుప్రీం కోర్టు సానుకూలంగా తీర్పును ఇవ్వడం పట్ల సుప్రీం కోర్టుకు కృతజ్ఞతలు తెలిపారు. 30ఏళ్లుగా నీర్వరామంగా ఎస్సీ వర్గీకరణకు కృషి చేస్తున్న మందకృష్ణ మాదిగ కృషి ఫలించే సమయం అసన్నం అయిందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అన్నబావుసాఠే కమిటీ సేవా సమితి అధ్యక్షులు నామత్కర్ దిగంబర్, ఎంఆర్‌పీఎస్ జిల్లా సీనియర్ నాయకులు షెల్కె ఆనంద్, గజేందర్, నాయకులు బోయిడి అభిషేక్, ఎస్సీ మోర్చ కాంగ్రెస్ పార్టీ నాయకులు వెన్నెల సతీష్, మల్లేష్, సారిపుత్ర, రాజు, గ్రామస్థులున్నారు.

ఎమ్మార్పీఎస్ నాయకుల సంబురాలు

భైంసా రూరల్, ఆగస్టు 2 : మండలంలోని కోతుల్‌గాం గ్రామంలో శుక్రవారం మాదిగ సంఘ నాయకులు సంబరాలు జరిపారు. సుప్రీం కోర్టు ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ ఆమోదం ముద్ర తెలపడంతో మాదిగ సంఘం నాయకులు సంతోషం వ్యక్తం చేశారు. 30 సంవత్సరాలు పోరాడిన విజయమన్నారు. అదేవిధంగా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాదిగ సంఘం అధ్యక్షుడు గంగారావు, ఉపాధ్యక్షుడు శంభు, శంకర్, ముత్తన్న, సురేష్, తదితర నాయకులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు బాసటగా నిలుస్తాం



చెక్కులు పంపిణీ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే బోస్లే నారాయణరావ్ పాటిల్

భైంసా, ఆగస్టు 2 : ప్రైవేట్, కార్పోరేట్ ఆసుపత్రులలో వైద్య సేవలు పొందిన బాధిత కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధితో బాసటగా నిలుస్తామని ముథోల్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ, మాజీ ఎమ్మెల్యే బోస్లే నారాయణరావ్ పాటిల్ వెల్లడించారు. శుక్రవారం భైంసాలోని తన క్యాంపు కార్యాలయంలో నియోజక వర్గ పరిధిలోని వివిధ ప్రాంతాలకు చెందిన వారికి ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరు చేయంచుకువచ్చిన ఆర్థిక సహాయపు చెక్కులను పంపిణీ చేశారు. వైద్యసేవల విషయంలో ఎవరు కూడా అర్థికపరమైన ఇబ్బందుల బారిన పడకుండా ఉండేందుకు సహాయ,సహకారాలు అందిస్తామన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారధ్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాల అభ్యున్నతి, ప్రాంతాల ప్రగతికి ప్రణాళికబద్ధమైన విధానాల ద్వారా చర్యలు చేపడుతోందన్నారు. ఇందులో కాంగ్రెస్ పార్టీ జిల్లా, నియోజక వర్గ ప్రతినిధులు, సీఎం రిలీఫ్‌ఫండ్ పొందిన బాధిత కుటుంబాల సభ్యులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని ఎలక్ట్రికల్ కాంట్రాక్టర్ల వినతి

కుభీర్, ఆగస్టు 2 : తమ సమస్యను పరిష్కరించలని కోరుతూ శుక్రవారం నిర్మల్ సర్కిల్ భైంసా డివిజన్ పరిధిలో గల ఎలక్ట్రికల్ కాంట్రాక్టర్ల అసోషియేషన్ ఆధ్వర్యంలో వరంగల్‌లోని టీజీఎన్‌పీడీసీఎల్ కార్యాలయంలో చైర్మన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అసోషియేషన్ జిల్లా అధ్యక్షుడు వసంత్‌రావు మాట్లాడుతూ తాము 15 సంవత్సరాలుగా ఈ కాంట్రాక్టు పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నామని, అయితే కొందరు అధికారులు భైంసా డవిజనల్ ఇంజీనీర్ శ్రీనివాస్‌రెడ్డి, ఏఏఇ కదం ఆదిత్యలు కుమ్మక్కయి డబ్బులు తీసుకొని కాంట్రాక్టులను కొత్తగా వచ్చిన రాయల్ ఎలక్ట్రికల్ అండ్ ఇంజనీరింగ్ వర్క్స్‌కు మాత్రమే ఇస్తున్నారని పేర్కొన్నారు. అందరికి సమానంగా పనులు ఇవ్వకుండా ఇలా డబ్బుల కోసం అర్హత లేని, అనుభవం లేని వారికి పనులు అప్పగిస్తున్నారని తెలిపారు. ఈ విషయమై తగిన చర్యలు తీసుకొని తమ సమస్యను పరిష్కరించాలని కోరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రసిడెంట్ మహ్మద్ అరిఫ్‌ఉద్దిన్, సెక్రటరీ రాజు నాయక్‌ర, క్యాషియర్ నవీన్‌రెడ్డి, ప్రశాంత్‌గౌడ్, సభ్యులు అనిల్‌కుమార్, వెంకటేశ్, రాజమోహన్, రహీం, పూనమ్ రాథోడ్, వినాయక్, రహ్మద్‌అలీ, షైక్ సహిద్, ఫిర్దూస్‌ఖాన్, అన్వేష్, వినిత్‌కుమార్, ఉదయ్‌కుమార్, మెహరాజ్, వివేక్, గంగైయ్య, శ్రీనివాస్, రాజినికాంత్‌రెడ్డి, తదితరులున్నారు.

ఉప కోశాధికారి కార్యాలయం సందర్శించిన డీటీవో

ముథోల్, ఆగస్టు 2 : ముథోల్‌లోని ఉపకోశాధికారి కార్యాలయం (ఎస్‌టీవో)ను శుక్రవారం నిర్మల్ జిల్లా డీటీవో గంగాధరయ్య సందర్శించారు. ఈ సందర్భంగా పలు రికార్డులు పరిశీలించి పలు వివరాలను ఇంచార్జి ఎస్‌టీవో రవిచంద్రకు అడిగి తెలుసుకున్నారు. ఈయన వెంట ఏటీవో వెంకట రమణారెడ్డి, తదితరులున్నారు.

ప్రయాణ ప్రాంగణాన్ని పరిశీలించిన భైంసా డిపో అధికారులు



కుభీర్ ప్రయాణ ప్రాంగణాన్ని పరిశీలిస్తున్న అధికారి

కుభీర్, ఆగస్టు 2 : మండల కేంద్రం కుభీర్ బస్టాండ్‌లో చిన్నపాటి వర్షానికే బురద మయం అవుతుందని సిమెంట్ ఫ్లోరింగ్ పనులు చేయాలని ఇటీవల గ్రామస్థులు సాప పండరి భైంసా డిపో మేనేజర్‌కు వినతిపత్రం అందజేశారు. కాగా శుక్రవారం భైంసా డీపో నుంచి విలేజ్ బస్సు ఆఫీసర్ సుధాకర్‌ను కుభీర్ బస్టాండ్‌ను పరిశీలనకు వచ్చారు. బస్టాండ్ ప్రాంగణంను పరిశీలించి నివేదిస్తామని తెలిపారు. ఈయన వెంట గ్రామస్థులు, ప్రయాణికులున్నారు.

స్వచ్ఛదనం.. పచ్చదనం నిర్వహణలో అలసత్వాన్ని ఉపేక్షించం

- కలెక్టర్ అభిలాష అభినవ్



మాట్లాడుతున్న కలెక్టర్



హాజరైన అధికారులు

నిర్మల్ కల్చరల్, ఆగస్టు 2 : జిల్లాలో ఈ నెల 5 నుంచి 9 వరకు స్వచ్ఛదనం.. పచ్చదనం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని దీన్ని నిర్లక్ష్యం చేసే అధికారులను ఉపేక్షించబోమని కలెక్టర్ అభిలాష అభినవ్ తెలిపారు. శుక్రవారం కార్యక్రమ అమలుపై అధికారులకు అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ప్రతి ష్టాత్మకంగా నిర్వహించాలన్నారు. రోజువారి ప్రణాళికలు రూపొందించుకొని కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ప్రజలకు స్వచ్ఛత, పరిశుభ్రత, మొక్కల పెంపకం, ప్లాస్టిక్ నిషేధం లాంటి వాటిపై అవగాహన కల్పించాలన్నారు. తొలిరోజు గ్రామస్థాయిలో గ్రామ కమిటీలు, పట్టణ స్థాయిలో వార్డు కమిటీలను ఏర్పాటు చేయాలన్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు, మహిళా స్వయం సంఘ సభ్యులు, యువతను సభ్యులుగా చేసి విస్తృత సమావేశాలు ఏర్పాటు చేయాలని సూచించారు. క్షేత్రస్థాయిలో ప్రజలకు అవగాహన కలిగేలా ర్యాలీలు నిర్వహించాలన్నారు. విద్యాసంస్థలు, ప్రభుత్వ కార్యాలయాల్లో, ప్రభుత్వ స్థలంలో విరివిగా మొక్కలు నాటాలన్నారు. విద్యార్థులు, యువత, మహిళా సంఘాలు, ఆశాకార్యకర్తలు, ఏఎన్ఎంలను వాలంటీర్లుగా నియమించి శ్రమదాన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ప్లాస్టిక్ వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించేందుకు గోడలకు పెయింటింగ్ వేయించాలని స్పష్టం చేశారు. మరుగుదొడ్ల నిర్మాణానికి 15, 20 రోజుల్లో అనుమతులు ఇవ్వాలని ప్రజల భాగస్వామ్యంతో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆదేశించారు. విద్యార్థులకు స్వచ్ఛదనం పచ్చదనంపై ఉపన్యాస, వ్యాసరచన పోటీలు నిర్వహించాలన్నారు. కాలానుగుణ వ్యాధులపై అవగాహన తదితర అంశాలపై దిశానిర్దేశం చేశారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, భైంసా ఆర్డీవో కోమల్ రెడ్డి, డీఆర్డీవో విజయలక్ష్మి, జడ్పీ సీఈవో గోవింద్, డీపీవో శ్రీనివాస్, చీఫ్ ప్లానింగ్ అధికారి బాబురావు, మండల ప్రత్యేక అధికారులు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఉదయం నడకకు వచ్చే వారికి సౌకర్యాలు కల్పిస్తాం



బస్సు ప్రారంభిస్తున్న అదనపు కలెక్టర్

నిర్మల్ కల్చరల్, ఆగస్టు 2 : ఎన్టీఆర్ మినీ స్టేడియంలో ఉదయం నడకకు వచ్చే వారికి సౌకర్యాలు కల్పిస్తామని అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ అన్నారు. శుక్రవారం ఆయన మార్నింగ్ వాకర్లతో కలిసి కొద్దిసేపు మైదానంలో నడిచారు. ప్రతి ఒక్కరు ఉదయం నడక అలవాటు చేసుకోవాలని తద్వారా సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారన్నారు. అక్కడి సమస్యలు అదనపు కలెక్టర్‌కు విన్నవించారు.

5 నుంచి స్వచ్ఛదనం.. పచ్చదనం : అదనపు కలెక్టర్

ఈ నెల 5 నుండి 9 వరకు జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీల్లో స్వచ్ఛదనం - పచ్చదనం నిర్వహించాలని అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ శుక్రవారం ఆదేశాలు జారీ చేశారు. ప్రభుత్వ ఆదేశం ప్రకారం స్వచ్ఛంద కార్యక్రమాలు ప్రతీ ఒక్కరు విజయవంతం చేయాలన్నారు. స్వచ్ఛ హీరోలుగా పేర్లు నమోదు చేసుకునే వారికి ప్రశంసా పత్రాలు కలెక్టర్ అందజేస్తారని తెలిపారు. ప్రజలు, యువత, విద్యార్థులు పాల్గొనాలన్నారు.

సీఎంతో ముఖాముఖికి తరలిన ఉపాధ్యాయ నేతలు

నిర్మల్ కల్చరల్, ఆగస్టు 2 : సీఎం రేవంత్‌రెడ్డి శుక్రవారం ఉపాధ్యాయులతో తలపెట్టిన ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొనేందుకు జిల్లాకేంద్రం నుంచి ఉపాధ్యాయ బృందం తరలివెళ్లింది. ఇటీవల బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ సజావుగా పూర్తి చేసినందుకు కృతజ్ఞతగా ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ ఎన్టీఆర్ మినీస్టేడియం నుంచి బస్సులను జెండా ఊపి ప్రారంభించారు. ఉపాధ్యాయులు తమకు కేటాయించిన బస్సుల్లోనే వెళ్లాలని సూచించారు. అల్పాహారం, భోజన వసతి కల్పించినట్లు తెలిపారు. డీఈవో రవీందర్‌రెడ్డి, జడ్పీ సీఈవో గోవింద్, అసిస్టెంట్ డిపో మేనేజర్ రాజశేఖర్, పలువురు అధికారులు పాల్గొన్నారు.

ముథోల్ : హైదరాబాద్‌లో శుక్రవారం జరిగిన సీఎం కృతజ్ఞత సభకు ముథోల్ మండల పీఆర్‌టీయూ సంఘం సభ్యులు ప్రత్యేక వాహనంలో హైదరాబాద్‌కు తరలి వెళ్లారు. తరలి వెళ్లిన వారిలో ఉపాధ్యాయులు మల్లారెడ్డి, ప్రకాష్, శ్రీనివాస్, సాయగౌడ్, తదితరులు ఉన్నారు.

ఉపాధి హామీ సిబ్బంది పనితీరుపై ఆగ్రహం



సిబ్బందితో ప్రత్యేక సమావేశంలో మాట్లాడుతున్న పీడీ

దస్తురాబాద్ రూరల్, ఆగస్టు 2 : ఉపాధి హామీ సిబ్బంది పనితీరుపై పీడీ విజయలక్ష్మి ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు పనితీరు మార్చుకోవాలని హెచ్చరించారు. శుక్రవారం మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ అధికారులు, సిబ్బందితో ప్రత్యేక సమావేశం ఏర్పాటు సందర్భంగా ఆమె మాట్లాడుతూ... గ్రామాల్లో క్షేత్రస్థాయిలో ఉపాధి సిబ్బంది పనిచేయడం లేదన్నారు. పని కల్పించడంలో అలసత్వం వహిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలంలోని పెర్కపల్లె, బుట్టాపూర్ గ్రామాల్లోని గ్రామ సమైక్య సంఘాల కోళ్ల షెడ్ల యూనిట్లను పరిశీలించారు.

సంక్షిప్త సమాచారం

సోయా పంటలో సస్యరక్షణ చర్యలు పాటించాలి



సోయా పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

కుంటాల, ఆగస్టు, 2: రైతులు ప్రస్తుత వర్షాకాలంలో సాగు చేసిన సోయా పంటలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ముథోల్ వ్యవసాయ పరిశోధన సంస్థ శాస్త్రవేత్తలు కార్తీక్, విజయ్ కుమార్‌లు అన్నారు. శుక్రవారం మండలంలోని కల్లూరు, అందకూర్ గ్రామాల్లో సోయా పంటను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రస్తుతం సోయా పంటలో కాండం తొలుచు పురుగు, తెల్లదోమ అధికంగా ఉందని దీని నివారణకు అవసరమైన పురుగుల మందులను పిచికారి చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయాధికారులు సోమలింగా రెడ్డి, ఏఈవోలు ఉన్నారు.

సోయాలో కాండం తొలిచే ఈగ ఉధృతి



సోయా పంటను పరిశీలిస్తున్న ఏవో

ముథోల్, ఆగస్టు 2 : మండలంలోని ఆయా గ్రామ శివారులో సోయాపంటలో కాండం తొలిచే ఈగ ఉధృతి ఉన్నట్లు ఏవో అజ్మీరాభాస్కర్ తెలిపారు. శుక్రవారం పలు సోయా పంటలను పరిశీలించారు. దీని నివారణకు కార్బాప్ హైడ్రోక్లోరైడ్ లేదా క్లోరంట్రా నీలిప్రోల్ 0.4 ఎంఎల్ లీటరు నీటిలో కలిపి పిచికారి చేసుకోవాలని సూచించారు.


మొక్కలు నాటిన రెవిన్యూ అధికారులు

నర్సాపూర్(జి), ఆగస్టు 2 : మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో గురువారం తహసీల్దార్ సోమ శ్రీనివాస్, నాయబ్ తహసీల్దార్ వహీద్, గిర్దావర్ వేణుగోపాల్ మొక్కలు నాటారు. ఈ సందర్బంగా తహసీల్దార్ మాట్లాడుతూ ఉద్యోగం చేస్తున్న వారు ఏ ప్రాంతంలో విధులు నిర్వహిస్తున్నా చక్కటి సేవలను ప్రజలకు అందించి, కార్యాలయం ఆవరణలో మొక్కలు నాటితే ఆ ప్రాంత వాసులకు చిరకాలంగా గుర్తుండిపోతారని తెలిపారు.



మొక్కలు నాటుతున్న దృశ్యం





ఆటోల వేగానికి అడ్డుకట్ట పడేనా?

బోథ్, ఆగస్టు 2: ఉపాధి కోసం ఆటోలను నడుపుకుంటూ జీవనం సాగిస్తున్న కొంత మంది ఆటో డ్రైవర్ల వేగానికి సామాన్యుల జీవితాలు బలి అవుతున్నాయి. ఫలితంగా ప్రమాదాల్లో అంగ వైకల్యమైన వారి జీవితాల్లో అంధకారం అలుముకుంటుండగా వారిపైన ఆధారపడ్డ వారి కుటుంబాల్లో విషాదం నెలకొంటుంది. ఫలితంగా వారిని నమ్ముకుని ఉన్న కుటుంబం రోడ్లపై వస్తుందని పలువురు పేర్కొంటున్నారు. బోథ్ మండలంలో మారుమూల గ్రామాల నుంచి బోథ్‌కు బోథ్ నుంచి వివిధ గ్రామాలకు ఆటోల్లో ప్రతిరోజూ వందల సంఖ్యలో ప్రయాణికులు ప్రయాణిస్తున్నారు. అయితే రోడ్లు బాగుపడటంతో ఆటో డ్రైవర్ల స్పీడ్‌కు అడ్డుకట్ట లేకుండా పోతోంది. పరిమితికి మించిన ప్రయాణికులతో మితిమీరిన వేగంతో వెళ్లడం వల్లనే ప్రమాదాలు జరుగుతున్నాయని పలువురు పేర్కొంటున్నారు. బుధవారం మర్లపెల్లి రోడ్డుపై జరిగిన ఆటో ప్రమాదానికి మితిమీరిన వేగమేనని పేర్కొంటున్నారు. వేగం ఫలితం ప్రాణాల మీదికి తెస్తుందని వాపోతున్నారు. ఆటోల స్పీడ్ కట్టడి చేయండి మితి మీరిన వేగంతో రోడ్లపై దూసుకుపోతున్న ఆటోల స్పీడ్‌కు కళ్లెం వేయాలని మండల ప్రజలు కోరుతున్నారు. ఇటీవల ఆటో ప్రమాదాలు పెరిగిపోతున్నాయని ఫలితంగా ప్రయాణికులు అంగవైకల్యంతో పాటు ప్రాణాలు కోల్పోవాల్సి వస్తుందని వాపోతున్నారు. మరోవైపు ఫిట్‌నెస్ పూర్తి అయిన ఆటోలు రోడ్లపై తిరుగుతున్నా పట్టించుకునే నాథుడే లేడని వాపోతున్నారు. అధికారులు ఆటోలపై కన్నేసి ఉంచాలని ప్రజలు కోరుతున్నారు.

డ్రైవర్ల ఓవర్ యాక్షన్

మహిళలకు ఉచిత బస్సు వల్ల ఆటోల డ్రైవర్లకు ఉపాధికి దెబ్బ తగిలిందని దీంతో పోలీసు ఆర్టీవో అధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారు. ఫలితంగా ఆటోడ్రైవర్లు మితి మీరి ప్రవర్తిస్తున్నారని పలువురు పేర్కొంటున్నారు. ఒక్కో ఆటోలో 15మంది వరకు ప్రయాణికులను తీసుకుని వెళుతున్నారని, డ్రైవర్ సీటుకు ఇరు వైపులా ప్రయాణికులను కూర్చోబెట్టుకుని వెళుతుండటంతో ప్రయాణికులు అర చేతిలో ప్రాణాలు పెట్టుకుని ప్రయాణిస్తున్నారు. కొన్ని ఆటోల డ్రైవర్లు మహిళల పట్ల అనుచితంగా ప్రవర్తిస్తున్నారని ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. ఆటోల డ్రైవర్లను కట్టడి చేయాలని పలువురు కోరుతున్నారు.



బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో నుజ్జునుజ్జైన ఆటోలు (ఫైల్)



















అంగన్‌వాడీలకు అవగాహన కల్పిస్తున్న ఎంపీడీవో రాజ్‌వీర్

తల్లిపాలు అమృతంతో సమానం

● నేరడిగొండ ఎంపీడీవో రాజ్‌వీర్

నేరడిగొండ, ఆగస్టు 2: తల్లిపాలు అమృతంతో సమానమని, తల్లిపాలు శ్రేయస్కరమని ఎంపీడీవో రాజ్‌వీర్, ఎంపీవో లక్ష్మణ్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మంజుల అన్నారు. తల్లిపాల వారోత్సవాల సందర్భంగా శుక్రవారం మండల కేంద్రంలో అంగన్‌వాడీ కార్యకర్తలతో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో అంగన్‌ఆడీ కార్యకర్తలతో కలిసి తల్లిపాల ఆవశ్యకత గురించి వివరించారు. పుట్టిన బిడ్డకు గంటలోపే ముర్రుపాలు పట్టించాలని, అవే పిల్లలకు మొదటి టీకాగా పని చేస్తుందన్నారు. తల్లిపాలు పట్టించడంతో పిల్లల్లో వ్యాధినిరోధక శక్తి పెరుగుతుందన్నారు. బాలింతలకు పౌష్టికాహారం అందించాలని సూచించారు. తల్లిబిడ్డలకు ఎలా జాగ్రత్తగా చూసుకోవాలని తగు సూచనలు చేశారు. కార్యకర్తలు ఆయా గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల అంగన్‌వాడీ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.







మూగ జీవాల గోస పట్టించుకోరా!?

● వర్షాకాలం నేపథ్యంలో రోగాల బారిన పడుతున్న పశువులు ● వేధిస్తున్న పశు వైద్యుల కొరత ● ఉన్న సిబ్బందిలో కొందరు విధులకు గైర్హాజరవడంతో అందని వైద్య సేవలు ● ఆందోళన వ్యక్తం చేస్తున్న రైతులు

బోథ్, ఆగస్టు 2: మండలంలోని నోరు లేని జీవాల గోస పట్టించుకునే వారే కరువయ్యారని మండలంలోని రైతులు వాపోతున్నారు. వర్షాకాలం మూగ జీవాలు వివిధ రకాల వ్యాధుల బారిన పడటం జరుగుతుంది. అయితే పశు వైద్యుల కొరతతోపాటు కొంత మంది సిబ్బంది విధులకు గైర్హాజర్ అవుతుండటంతో రైతులు పశువైద్యం కోసం 1962 పశు ఆరోగ్య సంచార అంబులెన్స్ బృందంపై ఆధారపడి ఉండల్సి వస్తుంది. దీంతో మూగ జీవులు ప్రత్యేక సరైన వైద్యం అందక మృత్యువాత పడుతున్నాయి. 1962 పశు ఆరోగ్య సంచార అంబులెన్స్ సిబ్బందికి గత 13 నెలలుగా వేతనాలు అందకపోవడంతో విధులు నిర్వహించే వారు. నిరాశ, నిస్పృహల మధ్యన విధులు నిర్వహిస్తున్నారు. దీంతో మారుమూల గ్రామాలకు మూగజీవికి వైద్యం అందడం కరువైంది. సరైన రోడ్డు వసతి లేని గ్రామాలకు అంబులెన్స్‌లు వెళ్లక గ్రామాల్లో పశువులకు నాటు వైద్యమే దిక్కైందని రైతులు వాపోతున్నారు.


పశు ఆరోగ్య సంచార వైద్య బృందం

● వ్యాధులపై అవగాహన కరువు

ప్రతీ ఏడాది వర్షాకాలంలో పశువులకు సోకే వివిధ రకాల వ్యాధుల పైన రైతులకు అవగాహన కల్పించడంతో పాటు ముందస్తు పశువైద్య శిబిరాలను ఏర్పాటు చేసే వారు ప్రభుత్వ పరంగా మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేకించి రైతుల కోసం శిబిరాలు ఏర్పాటు చేసేవారు. అయితే పశు వైద్య శాఖ వారు గ్రామ గ్రామాన వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి పశువులకు సోకే వ్యాధులపై అవగాహన కల్పించేవారు. అంతేకాకుండా పశువులకు సోకే వ్యాధులపై వైద్య శిబిరాలు ఏర్పాటు చేయకపోగా.. అవగాహన సైతం కల్పించడం లేదు. వర్షాకాలంలో పశువులకు గుండెవాపు, గాలికుంటు వ్యాధి.. మేకలు, గొర్రెలకు గాలికుంటు వ్యాధితో పాటు కలిసి దన్నిటి వల్ల పలు రకాల వ్యాధులు ప్రబలుతుంటాయి. అయితే ముందస్తు టీకాలు వేయడం వల్ల వ్యాధులు అదుపు చేసే ఆస్కారం ఉండేది. అయితే పాడి రైతులను గొర్రెల పెంపకందారులకు సరైన వైద్యం అందకపోవడంతోరైతులే వైద్యులుగా మారి నాటు వైద్యంచేయాల్సి వస్తుంది.

● వెక్కిరిస్తున్న ఖాళీలు

పశు వైద్యం అందని ద్రాక్షగా మారిందని మండల రైతులు వాపోతున్నారు. ఆసుపత్రిలో డాక్టర్ పోస్టులు ఖాళీగా ఉండగా ఉన్న సిబ్బంది సైతం కొన్ని చోట్ల మొక్కుబడిగా విధులు నిర్వహిస్తున్నారు. మండలంలోని సోనాల గ్రామంలో పశు వైద్యశాల ఎప్పుడు చూసినా.. మూతపడి ఉంటుందని పలు గ్రామాల రైతులు వాపోతున్నారు. ఆసుపత్రుల నిర్వహణపై ఉన్నతాదికారుల పర్యవేక్షణ లేక సిబ్బంది ఇష్టారాజ్యంగా నిధులు నిర్వహిస్తున్నారు. అధికారుల నిర్లక్ష్యంతో ఏటేటా మూగ జీవాల మరణాలు పెరిగిపోతున్నాయంటున్నారు.


ఇన్‌చార్జీ తహసీల్దార్ మహేష్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న రైతులు

కుప్టి ప్రాజెక్టు వివరాలు తెలిపాకే పనులు చేపట్టాలని వినతి

నేరడిగొండ, ఆగస్టు 2: మండలంలోని కుప్టి వద్ద నిర్మించ తలపెట్టిన కుప్టి ప్రాజెక్టు విషయాలను గ్రామస్థులకు తెలియజేశాకే పనులను చేపట్టాలని గ్రామస్థులు కోరారు. శుక్రవారం ఇరిగేషన్, రెవెన్యూశాఖ అధికారులు కుప్టి వద్ద జెండాలను పాతడానికి వెళ్లగా కుప్టి, కుమారి, గాజిలి, గాంధారి గ్రామాలకు చెందిన రైతులు, గ్రామస్థులు అక్కడికి చేరుకుని పనులను అడ్డుకున్నారు. ప్రాజెక్టు కింద ముంపునకు గురయ్యే వ్యవసాయ భూములు,నివాస గృహాలకు పరిహారం గురించి గ్రామస్థులకు వివరంగా తెలియజేసిన తర్వాతే పనులు చేపట్టాలని పేర్కొన్నారు. ప్రభుత్వంరూపొందించిన కుప్టి ప్రాజెక్టు డీపీఆర్‌ను నిర్వాసిత ముందుంచాలన్నారు. ఆ తర్వాతే స్థల నిర్ధారణ అలైన్‌మెంట్ పరిశీలన చేపట్టాలని డిమాండ్ చేశారు. దీంతో అధికారులు వెనుదిరిగారు.

కళాశాలను సందర్శించిన సుబేదార్ మేజర్

ఆదిలాబాద్ రూరల్, ఆగస్టు 2: ఆదిలాబాద్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళా శాల (ఆర్ట్స్ అండ్ కామర్స్) ఎన్‌సీసీ యూనిట్‌ను కొత్తగా వచ్చిన సుబేదార్ మేజర్ భగీరథ రామ్ సందర్శించారు. ప్రిన్సిపల్ డాక్టర్ అతిక్‌బేగం మాట్లాడుతూ విద్యార్థులకు ఉత్తమ శిక్షణ ఇవ్వాలని కోరారు. సుబేదార్ క్యాడెట్లను ఉద్దేశించి మాట్లాడుతూ తానే స్వయంగా శిక్షణ తరగతులను తీసుకుంటానని తెలిపారు.

పాలిథీన్ కవర్లు, వ్యర్థాలే ఆహారం

● మృత్యు ఒడికి చేరుతున్న మూగజీవాలు

ఇచ్చోడ, ఆగస్టు 2: ఎక్కడ కూడా సరిపడా ఆహారం అందని పరిస్థితి పశువులది. అడవుల్లోనూ, పంటపొలాల్లో మేపే పరిస్థితి లేదు. అడవులకు వెళ్లి పరగడుపుతోనే తిరిగి వస్తున్నాయి. కనీసం ఇంటి వద్ద మేత వేద్దామన్నా.. రైతన్నల ఇంట ఆ పరిస్థితి కనిపించడంలేదు. దీంతో ఏమీ చేయాలో తెలియక దిక్కుతోచని పరిస్థితి ఏర్పడుతుంది. బయట మేత దొరక్కపోవడంతో వ్యర్థాల మధ్యలో ఉన్న ప్లాస్టిక్ కవర్లను ఆహారంగా తింటున్నాయి పశువులు. ఎక్కడ చూసినా పాలిథిన్ కవర్లు పెనుభూతంలా మారాయి. కిరాణ కొట్లు, హోటళ్లు, పాన్‌షాప్‌లు, ఇళ్లలో ఎక్కువగా వీటి వినియోగం పెరగడంతో పాటు విరివిగా రోడ్లపై పారేయడంతో వాటిని తింటూ పశువులు మృత్యువాత పడుతున్నాయి. ప్రస్తుతం శుభకార్యాలయాలోనూ ప్లాస్టిక్ ఇస్తార్లను ఎక్కువగా వినియోగించడంతో ఆహారం కోసం వాటిని తింటూ మృతి చెందుతున్నాయి.

సమగ్ర విద్యాభివృద్ధికి కృషి : ఎంఈవో

ఆదిలాబాద్ రూరల్, ఆగస్టు 2: ఆదిలాబాద్ మండలంలో సమగ్ర విద్యాభివృదితో పాటు, ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి తనవంతుగా కృషి చేస్తానని మండల విద్యాధికారి డి.సోమయ్య పేర్కొన్నారు. ఆదిలాబాద్ మండల నూతన ఎంఈవోగా బాధ్యతలు స్వీకరించారు. ఆయనకు శుక్రవారం పలువురు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయనను శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో అధికారులు, ఉద్యోగులు, కుటుంబ సభ్యులు, స్నేహితులు పాల్గొన్నారు.

కాగా, ఆదిలాబాద్‌కు చెందిన ఎంఈవో సోమయ్య కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లా నుంచి 19ఏళ్ల తర్వాత బదిలీపై మళ్లీ ఆది లాబాద్‌కు రావడంతో బాల్యమిత్రులు కలిశారు. శుక్రవారం ఎంఈవో సోమయ్యను కలిసి శాలువాతో సన్మానించి చిన్ననాటి జ్ఞాపకాలను నెమరు వేసు కున్నారు. కార్యక్రమంలో బాల్య మిత్రులు ప్రమోద్ కుమార్ ఖత్రి, వికాస్, బీర్కూర్ వార్ నగేష్ కుమార్, నరేష్ రెడ్డి, వెంకటి, తదితరులు పాల్గొన్నారు.

ఆదిలాబాద్ రూరల్: పర్యావరణ సమతుల్యత కోసం ప్రతీఒక్కరు కృషి చేయాలని మండల విద్యా శాఖ అధికారి సోమయ్య అన్నారు. శుక్రవారం ఆదిలాబాద్ పట్టణంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో తెలంగాణ నేషనల్ గ్రీన్ క్రాప్ ఆధ్వర్యంలో పర్యావరణంపై వర్క్‌షాప్ నిర్వహించారు. దీనిలో బాగంగా పాఠశాలను సందర్శించిన ఆయన పర్యావరణంలో సమతుల్య లేని కారణంగా ప్రకృతి వైపరీత్యాలు వస్తున్నాయని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు. రసాయనాల వల్ల అనేక దుష్ప్రభావాలు వస్తున్నాయన్నారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చేదెలా?

● రోగులకు తప్పని తిప్పలు

బజార్‌హత్నూర్, ఆగస్టు 2: మండలకేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి రోగులు రావాలంటే జంకుతున్నారు. ఏకధాటిగా కురుస్తున్న వానల వలన ఆరోగ్య కేంద్రానికి చేరుకునే రోడ్డు మార్గం మొత్తం బురదమయంగా మారడంతో రోగులు బురదలోంచి రావడానికి ఇబ్బంది పడుతున్నారు. వృద్ధులు బురదలో రావాలంటేనే జంకుతున్నారు. కాలు జారి కిందపడిపోతే ఉన్న రోగం కన్నా కొత్త రోగాన్ని కొనితెచ్చుకోవడంలా జరుగుతుందోనని బయపడి ఇతరులు సహాయంతో ఆసుపత్రికి చేరుకుంటున్నారు. సంబందింత అధికారులు దృష్టి సారించి మొరం వేయిస్తే రోగులకు మేలు జరుగుతుందని మండలవాసులు కోరుతన్నారు.


● ప్రభుత్వాసుపత్రికి బురదలో నుంచి నడిచి వస్తున్న రోగులు

విద్యుత్‌శాఖ అధికారుల పొలం బాట

● వంగిన స్తంభాలు, లూజ్ లైన్లకు మరమ్మతులు


పొలం బాట పట్టిన విద్యుత్ అధికారులు

దిలావర్‌పూర్, ఆగస్టు 2 : మండలంలో విద్యుత్ శాఖ అధికారులు పొలం బాట పట్టారు. ఉత్తర తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ ప్రత్యేకంగా నిర్వహిస్తున్న పొలం బాట కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ఉపక్రమించారు. శుక్రవారం మండల విద్యుత్ శాఖ ఏఈ శ్రీనివాస్ విద్యుత్ సిబ్బందితో కలిసి రైతులను కలిసి వారి భాగస్వామ్యంతో వంగిన స్తంభాలను సరి చేయడంతో పాటు వదులుగా ఉన్న కరెంట్ తీగలను లాగి బిగుతుగా చేశారు. ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ ఉన్న పొదలను తొలగించారు. రైతులకు విద్యుత్ ప్రమాదాల నివారణకు తీసుకోవలసిన చర్యలు, మోటార్ల వద్ద కెపాసిటర్లను బిగించడం వలన కలిగే ప్రయోజనాలు, ఆటోమేటిక్ స్టార్టర్ల వల్ల కలిగే విద్యుత్ నష్టాలపై అవగాహన కల్పించారు. రైతుల అంగీకారంతో వారి సమక్షంలో ప్రయోగాత్మకంగా కొన్ని మోటార్లకు కెపాసిటర్లు ఏర్పాటు చేశారు. చాలా కాలం తర్వాత వంగిన స్తంభాలను, లూజ్ లైన్లను సరిచేస్తుండటంతో రైతులు ఆనందం వ్యక్తం చేశారు.


వంగిన స్తంభాలు సరిచేస్తున్న విద్యుత్ అధికారులు, రైతులు

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి


న్యూ లోలంలో మురికి కాలువలను పరిశీలిస్తున్న ఎంపీడీవో

దిలావర్‌పూర్, ఆగస్టు 2 : సీజనల్‌గా వచ్చే వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీవో అరుణ రాణి అన్నారు. శుక్రవారం న్యూ లోలం గ్రామంలో ఫ్రైడే డ్రై డే కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె పలు వార్డులను తిరిగి డ్రైనేజీలను, రోడ్లను తనిఖీ చేశారు. ఎక్కడ మురుగు నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. అనంతరం జాతీయ రహదారి ప్రక్కన నిర్వహించిన వన మహోత్సవంలో పాల్గొన్నారు. మొక్కలు నాటారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పరిరక్షించాలని ఎంపీడీవో అన్నారు. పర్యావరణ పరిరక్షణలో మొక్కల పాత్ర చాలా కీలకమన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో గోవర్ధన్, కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.

రైతులు మోటార్లకు కెపాసిటర్లు అమర్చుకోవాలి

● ఇన్‌చార్జి ఏడీఈ కేశెట్టి శ్రీనివాస్

దస్తురాబాద్ రూరల్, ఆగస్టు 2 : పంట పొలాల్లోని మోటార్లకు కెపాసిటర్లను అమర్చుకోవాలని రైతులకు ఇంచార్జి ఏడీఈ కేశెట్టి శ్రీనివాస్ సూచించారు. పొలం బాట కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండలంలోని భూత్కూర్ గ్రామ పంచాయతీలోని రాంపూర్ గ్రామ శివారులోని పంట పొలాల్లో సిబ్బందితో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా రైతులకు విద్యుత్ ప్రమాదాలు, జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఆయన వెంట విద్యుత్ సిబ్బంది నాగరాజు, సదానందం , చరణ్ దాస్, రాజు, రైతులు ఉన్నారు.

హైదరాబాద్‌కు తరలివెళ్లిన మాజీ సర్పంచ్‌లు

ముథోల్, ఆగస్టు 2 : సర్పంచ్‌ల పదవీకాలం ముగిసి నెలలు గడిచినా గతంలో చేసిన అభివృద్ధి పనులకు బిల్లులు రాకపోవడంతో తెలంగాణ సర్పంచ్‌ల జాయింట్ యాక్షన్ కమిటీ పిలుపు మేరకు శుక్రవారం హైదరాబాద్‌లో నిరసన తెలపటానికి ముథోల్, బాసర మండలాలకు చెందిన మాజీ సర్పంచ్‌లు ప్రత్యేక వాహనంలో వెళ్లారు. తాము చేసిన అభివృద్ధి పనులకు నేటికీ ప్రభుత్వం బిల్లులు మంజూరు చేయకపోవడంతో అప్పులు పెరిగిపోయి ఇబ్బందులు పడుతున్నామని వారు పేర్కొన్నారు. తమ బిల్లులు మంజూరు చేసేంతవరకు శాంతియుత నిరసన తెలియజేస్తామని వారు పేర్కొన్నారు. హైదరాబాద్ బయలుదేరిన వారిలో మాజీ సర్పంచ్‌లు రాంచందర్, సాయినాథ్, శివాజీ, దిగంబర్, నాయకులు రవికిరణ్ గౌడ్, మైసాజి, కిష్టయ్య, దత్తాద్రి, గౌతమ్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పింగళి వెంకయ్య జన్మదినం



కుంటాల, ఆగస్టు, 2 : మండల కేంద్రం కుంటాల స్థానిక శాంతినికేతన్ పాఠశాలలో శుక్రవారం భారత జాతీయ త్రివర్ణ పతాక రూపకర్త పింగళి వెంకయ్య జన్మదినాన్ని ఘనంగా నిర్వహించారు. ఈయన క్విట్ ఇండియా, వందేమాతర ఉద్యమాలలో త్రివర్ణ పతాకం భారత ప్రజల గుండెల్లో దేశభక్తిని కలిగించి ఆంగ్లేయులకు వ్యతిరేకంగా పోరాటం చేపట్టారని ప్రిన్సిపల్ సంతోష్ అన్నారు. 1947 ఆగస్టు 15 నుండి జాతీయ పతాకం దేశ అధికారిక జెండాగా మారిందని, త్రివర్ణ పతాకం అశోకచక్రంలో కుంకుమ, తెలుపు, ఆకుపచ్చరంగులను కలిగి ఉంటుందని డైరెక్టర్ ప్రవీణ్ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు బ్యాగుల పంపిణీ

దిలావర్‌పూర్, ఆగస్టు 2 : మండలంలోని మాయపూర్ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు బ్యాగులను పంపిణీ చేశారు. ప్రముఖ వైద్యులు డాక్టర్ దేవేందర్‌రెడ్డి సహకారంతో విద్యార్థులకు బ్యాగులు, నోటు పుస్తకాలు, పెన్సిళ్లు పంపిణీ చేసినట్లు ప్రధానోపాధ్యాయుడు మోహన్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా గ్రామస్తులు డాక్టర్ దేవేందర్‌రెడ్డి దాతృత్వానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

జాతీయ సమ్మేళనానికి

తరలివెళ్లిన గౌడజన హక్కుల నాయకులు

నిర్మల్ కల్చరల్, ఆగస్టు 2 : నేడు, రేపు మధ్యప్రదేశ్ రాష్ట్ర రాజధాని భోపాల్‌లో జరిగే గౌడ జాతీయ సమ్మేళనానికి జిల్లా నుంచి నాయకులు శుక్రవారం తరలివెళ్లారు. రాష్ట్ర చైర్మన్ అమరవేణి నర్సాగౌడ్, జాతీయ జనరల్ కార్యదర్శి రాగుల సిద్ధిరాములు గౌడ్, బాలరాజ్, బాలేశం గౌడ్, బాలసాని సురేష్, తదితర నాయకులున్నారు.

ఉపకరణాల కోసం విద్యార్థుల గుర్తింపు

నిర్మల్ కల్చరల్, ఆగస్టు 2 : పాఠశాలల్లో చదివే 18 ఏళ్ల లోపు దివ్యాంగ విద్యార్థులకు ఉచిత పరికరాలు అందించేందుకు విద్యార్థులను నిర్ధారించినట్లు విద్య సమన్వయకర్త ప్రవీణ్ కుమార్ తెలిపారు. శుక్రవారం టీఎన్జీవో భవనంలో శిబిరాన్ని నిర్వహించగా 246 మంది హాజరైనట్లు పేర్కొన్నారు. అలింకో సంస్థ ఉపకరణాలు తయారు చేసి అందజేస్తారన్నారు. వైద్యులు రూపేష్, అమన్, లియోలు నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా సుదర్శన్

దిలావర్‌పూర్, ఆగస్టు 2 : మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా పి. సుదర్శన్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ప్రిన్సిపాల్‌గా చేసిన శంకర్ బదిలీపై వెళ్లడంతో పెద్దపల్లిలో పని చేసిన సుదర్శన్ దిలావర్‌పూర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా బదిలీపై వచ్చారు. కాగా కళాశాల అధ్యాపకులు, సిబ్బంది నూతన ప్రిన్సిపాల్‌ను సత్కరించారు.

పాఠశాలకు టీవీ వితరణ

భైంసా రూరల్, ఆగస్టు 2 : ఇటీవల జరిగిన బదిలీల్లో మాటేగాం ప్రాథమిక పాఠశాలకు వచ్చిన ఉపాధ్యాయుడు రవి జాదవ్ రూ. 26 వేల విలువ గల టీవీని పాఠశాలకు అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల కాంప్లెక్స్ హెచ్ఎం రమణారావు మాట్లాడుతూ... ఉపాధ్యాయులే సమాజ నిర్మాతలని, విద్యార్థుల భవిష్యత్తుకు గట్టి పునాది వేయాలన్నారు. అనంతరం బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులను, గ్రామ పంచాయతీ కార్యదర్శిని శాలువ, పూలమాలతో సన్మానించి జ్ఞాపికను అందజేశారు.



ఆంధ్రజ్యోతి
andhrajyothy.com శుక్రవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 31.8, కనిష్ఠం 22.7

ఆదిలాబాద్
జిల్లా వార్తలు

శనివారం 3 ఆగస్టు 2024


ఇచ్చోడ మండలకేంద్రంలో రోడ్డుపైనే నిలిచి ఉన్న వర్షపునీరు

'స్వచ్ఛదనం-పచ్చదనం'కు.. శ్రీకారం


● జిల్లాకేంద్రంలో అధ్వానంగా కనిపిస్తున్న పారిశుధ్యం

- జిల్లాలో వానాకాలం సీజన్‌లో ఎదురయ్యే సమస్యలు, సవాళ్లను ఎదుర్కొనేందుకు ప్రత్యేక కార్యక్రమం
- ఈనెల 5నుంచి గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో పారిశుధ్యం, పచ్చదనంపై స్పెషల్ డ్రైవ్
- పర్యవేక్షణకు ప్రత్యేకాధికారుల నియామకం
- గ్రామాల్లో ప్రజాప్రతినిధుల భాగస్వామ్యంపై అనుమానాలు
- కార్యాచరణకు సిద్ధమవుతున్న అధికారులు
- జిల్లావ్యాప్తంగా 468 పంచాయతీలు, మున్సిపల్ పరిధిలోని 49 వార్డుల్లో 5రోజుల పాటు ప్రత్యేక కార్యక్రమాలు

ఆదిలాబాద్ ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): వానాకాలం సీజన్‌లో ఎదురయ్యే సమస్యలు, సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమయ్యింది. ఇందులో భాగంగానే స్వచ్ఛదనం-పచ్చదనం పేరిట ప్రత్యేక కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. గత ప్రభుత్వం చేపట్టిన పల్లె ప్రగతి పథకం మాదిరిగానే స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాన్ని గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించాలని జిల్లా అధికారులకు రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఇందులో భాగంగానే ఈ నెల 5 నుంచి 9 వరకు వివిధ రకాల కార్యక్రమాలను నిర్వహించేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు. జిల్లాలోని 468 గ్రామ పంచాయతీలు, మున్సిపల్ పరిధిలోని 49వార్డులలో 5 రోజుల పాటు పారిశుధ్యం, పచ్చదనంపై స్పెషల్ డ్రైవ్‌ను నిర్వహించనున్నారు. ముఖ్యంగా వానాకాలం సీజన్‌లో సీజనల్ వ్యాధులను అరికట్టి పరిసరాల పరిశుభ్రత, వన మహోత్సవం లాంటి కార్యక్రమాలను నిర్వహిస్తారు. ఆయా శాఖల సమన్వయంతో స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాన్ని జిల్లా వ్యాప్తంగా విజయవంతం చేసేందుకు అధికార యంత్రాంగం సిద్ధమవుతోంది.

జిల్లాలో ప్రత్యేక కార్యక్రమాలు

ప్రభుత్వ ఆదేశాల ప్రకారం జిల్లాలో స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాన్ని అమలు చేయనున్నారు. ఇందులో భాగంగానే ఐదు రోజుల పాటు వివిధ రకాల ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తారు. ఆగస్టు 5న స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాన్ని ప్రారంభించి స్థానిక నాయకులు, మహిళా సంఘాలు, యువ కులు, వార్డు కమిటీ సభ్యులతో ప్రత్యేక సమావేశం ర్యాలీలు నిర్వహించాలి. పాఠశాల, అంగన్‌వాడీలు, హాస్టల్‌లు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, బస్‌స్టాపులు మొదలైన వాటిని శుభ్రపరచడం, ప్లాస్టిక్ వినియోగంపై ప్రజల్లో అవగాహన పెంచడం, ప్రజల భాగస్వామ్యంతో శ్రమదానం నిర్వహించడం, గ్రామీణ ప్రాంతాల్లో మరుగుదొడ్ల నిర్మాణం పూర్తయ్యేలా చర్యలు తీసుకోవడం, ఆగస్టు 6న వర్షపు నీటి సంరక్షణతో పాటు ప్రతీరోజు క్లోరినేషన్ చేయడం, నీటి సరఫరా, క్లోరినేషన్ స్థాయిలను పరీక్షించడం, సరస్సులు, చెరువులు, కుంటలను పునరుద్ధరించడం, 7న కాల్వలు, నీరు నిల్వ ఉన్న ప్రాంతాలను పరిశీలించడం, నీటి నిల్వ ఉండే ప్రాంతాలను పూడ్చివేయడం, నీటిని బయటకు తోడేయడం, రోడ్ల మరమ్మతులు చేయడం, 8న ఆరోగ్యం, పిచ్చికుక్కల సమస్యపై ప్రత్యేకదృష్టిని సారించాల్సి ఉంటుంది. ముఖ్యంగా డెంగ్యూ, మలేరియాపై ప్రజల్లో అవగాహన కల్పించడం, గ్రామ పంచాయతీలు, పట్టణ ప్రాంతాల్లో జ్వరాల పరిస్థితిపై నివేదికలు రూపొందించడం, ఫాగింగ్ నిర్వహించడం, ఆగస్టు 9న ప్రతీ 3వ శనివారం స్వచ్ఛదనం-పచ్చదనం రోజుగా పరిగణించడం, ప్రజలు తమ ఇళ్లను, పరిసరాలను శుభ్రం చేసుకోవడం, బహిరంగ ప్రదేశాలు, ప్రభుత్వ కార్యాల యాలను శుభ్రపరచడం, మొక్కలు నాటడం, పార్కులలో పిచ్చిమొక్కలను తొల గించడం లాంటి కార్యక్రమాలను చేపట్టాల్సి ఉంటుందని సంబంధిత శాఖల అధికారులు పేర్కొంటున్నారు. ఈ కార్యక్రమాలపై అధికారులు నిరంతరంగా పర్యవేక్షణ చేస్తారు.

అధికారులదే పూర్తి బాధ్యత

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమం విజయవంతమయ్యేలా అధికారులే బాధ్యత తీసుకోవాల్సి ఉంటుంది. గ్రామ పంచాయతీ స్థాయిలో ప్రత్యేకాధికారి పంచాయతీ కార్యదర్శి, ఆశా వర్కర్, గ్రామ కార్యదర్శులు, ఇతర గ్రామ పంచాయతీ స్థాయి కార్యదర్శులతో ప్రత్యేక బృందా లను ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. పట్టణ ప్రాంతాలలో వార్డు స్థాయిలో ప్రత్యేకాధికారి వార్డు అధికారి, స్థానిక కౌన్సిలర్, కార్పొరేటర్లతో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేస్తారు. ప్రత్యేకాధికారులు, మున్సిపల్ కమిషనర్ ఈ కార్యక్రమాలను పర్యవేక్షించి జిల్లా కలెక్టర్‌కు ఎప్పటికప్పుడు నివేదికలను అందించాల్సి ఉంటుంది. ప్రత్యేక బృందాలు నిత్యం కార్యక్రమాలు నిర్వహిస్తున్న ప్రాంతాలను సందర్శించి సలహాలు, సూచనలు చేయాల్సి ఉంటుంది. గ్రామ పంచాయతీ స్థాయిలో చేపట్టే కార్యక్రమాల వివరాలను నిత్యం జిల్లా పంచాయతీ అధికారికి అందజేయాల్సి ఉంటుంది. మండల పరిషత్ ప్రత్యేకాధికారులు తమ పరిధిలోని గ్రామాలను సందర్శించి పర్యవేక్షణ, నివేదికలను జిల్లా పరిషత్ సీఈవోకు అందించాలి. జిల్లా పరిషత్ సీఈవో, డీఆర్డీవో, డీపీవో, మున్సిపల్ కమిషనర్లు, అదనపు కలెక్టర్లు పర్యవేక్షణలో అన్ని గ్రామ పంచాయతీలు, పట్టణ, స్థానిక సంస్థలను పర్యవేక్షించి ప్రభుత్వ మార్గదర్శకాలు అమలయ్యేలా చర్యలు చేపట్టాలి. స్వచ్ఛదనం-పచ్చదనం నిర్వహణ లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని జిల్లా ఉన్నతాధికారులు హెచ్చరిస్తున్నారు. అత్యవసరమైతే తే సెలవులు తీసుకోవద్దని జిల్లా కలెక్టర్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అంతేకాకుండా ఐదు రోజుల పాటు నిర్వహించే ప్రత్యేక కార్యక్రమాలను విజయ వంతమయ్యేలా ఆయా శాఖల అధికారులు క్షేత్రస్థాయి సిబ్బంది సమన్వయంతో పని చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.

గ్రామాల్లోనే అసలు సమస్య

ప్రభుత్వం చేపడుతున్న స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమం గ్రామీణ ప్రాంతాల్లో ఏమేరకు విజయవంతమవుతుందోనన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఎందుకంటే ఇప్పటికే గ్రామ, మండల, జిల్లా పరిషత్ పాలకవర్గాల పదవీ కాలం ముగిసిపోవడంతో ప్రత్యేకాధికారుల పాలనే కొనసాగుతోంది. గ్రామ పంచాయతీల్లో అయితే ఆరు మాసాలుగా ప్రత్యేకాధికారుల పాలనే కొనసాగుతోంది. దీంతో ప్రజాప్రతినిధుల భాగస్వామ్యం లేకుండా పోయింది. ప్రభుత్వం నిర్వహిస్తున్న స్పెషల్ డ్రైవ్ విజయవంతం కావాలంటే ప్రజాప్రతినిధులు, యువత, స్వచ్ఛంద సంస్థలు భాగస్వామ్యం కావాల్సి ఉంటుంది. కానీ ప్రజాప్రతినిధుల పదవీ కాలం ముగిసిపోవడంతో సొంత పనులకే పరిమితమవుతున్నారు. ఐదు రోజుల పాటు సమయాన్ని వెచ్చించి కార్యక్రమాలను విజయవంతం చేసేందుకు ప్రజా ప్రతినిధులు ముందుకు వచ్చే పరిస్థితి కనిపించడం లేదు. ఇప్పటికే పదవీ కాలం ముగిసిపోయిన సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీల వేతనాలు కూడా పూర్తిస్థాయిలో అందకపోవడం.. అలాగే గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లులు పెండింగ్‌లో ఉండడంతో ప్రభుత్వ తీరుపై ప్రజాప్రతినిధులు కొంత నిరాశగానే ఉన్నట్లు తెలుస్తుంది. ఇలాంటి పరిస్థితుల్లో స్వచ్ఛదనం-పచ్చదనం ఏమేరకు సక్సెస్ అవుతుందోనన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. అక్కడక్కడా అధికార పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులు మాత్రమే హాజరయ్యే అవకాశం ఉంటుంది. ప్రతిపక్ష పార్టీలకు చెందిన ప్రజాప్రతినిధులు మాత్రం ప్రభుత్వం నిర్వహిస్తున్న స్పెషల్ డ్రైవ్‌లో పాల్గొనడం కష్టమేనన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ప్రత్యేకాధికారులు సమన్వయం చేసుకుని ముందుకు వెళ్లాల్సిన పరిస్థితి ఉంటుంది. ప్రత్యేక కార్యక్రమాలపై ప్రజల్లో ఏమేరకు స్పందన ఉంటుందో? వేచి చూడాల్సి ఉంది.



సంక్షిప్త సమాచారం


సీఐగా బాధ్యతలు స్వీకరిస్తున్న సునీల్‌కుమార్

వన్ టౌన్ సీఐగా సునీల్‌కుమార్

ఆదిలాబాద్ రూరల్, ఆగస్టు 2: ఆదిలాబాద్ వన్ టౌన్ పోలీస్ స్టేషన్ నూతన సీఐగా బొమ్మగాని సునీల్‌కుమార్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయనకు స్టేషన్ సిబ్బంది పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. సిబ్బందిని పరిచయం చేసుకున్నారు. అనంతరం వారితో సమావేశం నిర్వహించారు. పట్టణంలోని శాంతి భద్రతల పరిరక్షణకు తనవంతు కృషి చేస్తానని సీఐ పేర్కొన్నారు. గతంలో ఇక్కడ సీగా పని చేసిన సత్యనారాయణ ఐజీపీ కార్యాలయానికి బదిలీ అయ్యారు.

ఐటీఐలో మూడో దఫా దరఖాస్తుల స్వీకరణ : శ్రీనివాస్

ఉట్నూర్, ఆగస్టు 2: ఉట్నూర్ మండల కేంద్రంలోని కొమురంభీం ప్రాంగణంలో ఉన్న గిరిజన పారిశ్రామిక శిక్షణ సంస్థలో చేరడానికి మూడవ దఫా దరఖాస్తుల స్వీకరణచేపడుతున్నామని ఐటీఐ ఇన్ చార్జీ శ్రీనిర శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు ఈనెల 12 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని పేర్కొన్నారు.

రుణమాఫీపై ఇబ్బందులు ఉంటే నేరుగా సంప్రదించాలి

జైనథ్, ఆగస్టు 2: కాంగ్రెస్ ప్రభుత్వం రైతు రుణ మాఫీకి కట్టుబడి ఉందని ఎంపీడీవో రవీంద్రనాథ్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రమైన జైనథ్ రైతు వేదిక భవనంలో నిర్వహించిన రైతు అవగాహన సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో బీఓఎం మేనేజర్ శివప్రసాద్‌లతో పాటు ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

తపాలా సేవలను సద్వినియోగం చేసుకోవాలి : ఐపీవో

బజార్‌హత్నూర్, ఆగస్టు 2: మండలంలో తపాలా శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సేవలను మండల వాసులు సద్వినియోగం చేసుకోవాలని ఐపీవో సందీప్‌కుమార్ అన్నారు. గ్రామీణ ప్రాంతాలలో కేవలం ప్రత్యుత్తరాలను చేరవేసేదిగానే తపాల శాఖకు పేరొందినప్పటికీ మారుతున్న ప్రపంచీకరణకు అనుగుణంగా తపాల శాఖలోనూ ఆన్‌లైన్ సేవలు అందుబాటులో ఉన్నాయన్నారు. బ్యాంకులలో ఉండే సేవల కన్న అధికాంగానే తపాల శాఖ ఆధ్వర్యంలో ఖాతాదారులకు అందిస్తున్నామని తెలిపారు. పిల్లల పైచదువులు, పెళ్లిల కోసం సుకన్య సంమృద్ధి యోజన, ప్రమాద బీమా, ఫిక్స్‌డ్ డిపాజిట్ వంటి సేవలు అందుబాటులో ఉన్నాయన్నారు. ఇందులో పోస్టల్ బ్యాంకు మేనేజర్ సాగర్, మాజీ ఎంపీటీసీ పాండురంగ్, ఏపీవో శ్రీనివాస్, ప్రవీణ్, తదితరులున్నారు.

సుప్రీం తీర్పు పట్ల ఎమ్మార్పీఎస్ సంబరాలు

● ఎస్సీల వర్గీకరణపై తీర్పు పట్ల నాయకుల హర్షం

ఉట్నూర్, ఆగస్టు 2: ఎస్సీల వర్గీకరణపై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును హర్షిస్తూ మండలకేంద్రంలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం సంబరాలు నిర్వహించుకున్నారు. మండల కేంద్రంలోని బాబు జగ్జీవన్‌రామ్, బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసిన అనంతరం బాణాసంచా కాల్చారు. మాదిగ జాగృతి సంఘం ఉమ్మడి జిల్లా కన్వీనర్ నాతరి రమేష్ హర్షం వ్యక్తం చేశారు. ప్రభుత్వం సైతం తక్షణమే ఆర్డినెన్స్ తెచ్చి ఎస్సీ వర్గీకరణ చేయాలన్నారు. మందకృష్ణ మాదిగ దశాబ్దాల ఉద్యమానికి న్యాయం జరిగిందన్నారు. మాదిగ జాతి 30ఏళ్ల సుదీర్ఘ ఉద్యమకల నేరవేరిందని ఎస్సీ రిజర్వేషన్ అమలుపై సుప్రీంకోర్టు ఇచ్చిన చారిత్రాత్మక తీర్పును స్వాగతిస్తున్నామని మాదిగ లాయర్ ఫెడరేషన్ జిల్లా నాయకులు నాతరి రాజుమాదిగ అన్నారు. మాదిగ సోదరులతో కలిసి ఒకరినొకరు స్వీట్లు తినిపించుకుని సంబరాలు జరుపుకున్నారు. మంద కృష్ణమాదిగ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో కొమ్ము బాపురావు మాదిగ, మహేష్ మాదిగ, రవి మాదిగ, సాగర్ మాదిగ, కొల్లూరి స్వామి, సుమన్, ప్రసాద్, రింకు, మనోహర్ మాదిగ, తదితరులు పాల్గొన్నారు.

● సుప్రీం కోర్టు తీర్పు చారిత్రాత్మకం

నేరడిగొండ: ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పు చారిత్రాత్మకమని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు కుడాల స్వామి, గజ్జెల శంకర్‌లు అన్నారు. ఎస్సీ వర్గీకరణపై దేశ అత్యున్నత న్యాయస్థానం ఇచ్చిన తీర్పును హర్షిస్తూ శుక్రవారం మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసిన అనంతరం మందకృష్ణ మాదిగ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాదిగ ఉపకులాల అభివృద్ధి కోసం చేపట్టిన వర్గీకరణ పై సుప్రీంకోర్టు చారిత్రాత్మక తీర్పునిచ్చిందని, సుదీర్ఘ పోరాటానికి న్యాయం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు గజ్జెల అశోక్, గొనెలఅడెల్లు, ఆయా గ్రామాలకు చెందిన ఎమ్మార్పీఎస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.


ఉట్నూర్‌లో సంబరాలు నిర్వహిస్తున్న ఎంఆర్‌పీఎస్ నాయకులు


నేరడిగొండలో మందకృష్ణమాదిగ చిత్రపటానికి క్షీరాభిషేకం..

ఆసిఫాబాద్ రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలి

● ఆదివాసీ గిరిజన విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో ధర్నా ● ఇటు అధికారులు.. అటు ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని ఆగ్రహం

ఉట్నూర్, ఆగస్టు 2: మండలంలోని లింగోజితండా ఎక్స్‌రోడ్డు నుంచి ఆసిఫాబాద్, గాదిగూడ వెళ్లే రహదారులకు మరమ్మతులు చేపట్టాలంటూ ఆదివాసీ గిరిజన విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. శుక్రవారం లింగోజితాండ ఎక్స్‌రోడ్డువద్ద ఉన్న ఆసిఫాబాద్ రహదారి పై ధర్నానిర్వహించి వాహనాలను నిలిపి వేశారు. గత దశాబ్దా కాలంగా రోడ్లు భవనాల శాఖ అధికారుల ఆధ్వర్యంలో ఉన్న ఆసిఫాబాద్, నార్నూర్‌గాదిగూడ రహదారులు పూర్తిగా గుంతలమయం కావడంతో పాటు వాహనాలు నడిచే స్థితిలో లేక పోవడంతో తరుచు ప్రమాదాలు జరుగుతు పదుల సంఖ్యలో వాహణదారులు మరణిస్తున్న ప్రభుత్వంకాని, స్థానిక ప్రజా ప్రతినిధులు కాని ఏ మాత్రం పట్టించుకోవడం లేదని జరిగిన విద్యార్థి సంఘ నాయకుడు సోమేశ్వర్ ఆరోపించారు.ఖానాపూర్ ఎమ్మెల్యే బొజ్జుపటేల్ జోక్యం చేసుకుని రోడ్ల మరమ్మత్తులకు చర్యలు తీసుకోవాలని కోరారు.అదే విధంగా ఇప్పటికైనా ఆదిలాబాద్,కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లాల కలెక్టర్లు చొరవ తీసుకొని వెంటనే మరమ్మత్తులు చేపట్టాలని లేనట్లయితే దిగ్బంధనంచేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలోశివప్రసాద్,కపిల్, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. ఉట్నూర్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గండికోట మొగిలి, ఇంద్రవెల్లి ఎస్సై దుబ్బాక సునీల్, ఏఎస్సై దిలీప్‌లు విద్యార్థులను సముదాయించి ధర్నా విరమింప చేయించారు.


లింగోజి తండా ఎక్స్‌రోడ్డు వద్ద ఆసిఫాబాద్ రోడ్డుపై ధర్నా చేస్తున్న దృశ్యం


ఆదిలాబాద్‌లో సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న కళాకారులు

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

ఆదిలాబాద్ రూరల్, ఆగస్టు 2: తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులకు పీఆర్‌సీని అమలు చేస్తూ ప్రభుత్వం నిర్ణయించింది. దీనిలో భాగంగా శుక్రవారం ఆదిలాబాద్ కళాకారుల బృందం పట్టణంలోని అమర వీరుల స్తూపం వద్ద ఘనంగా నివాళులర్పించారు. అనంతరం సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు జూపల్లి కృష్ణారావ్, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావ్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ఇది వరకు రూ.24,514 ఉన్న గౌరవ వేతనాన్ని రూ.31,868కు పెంచారు. కార్యక్రమంలో కళాకారులు పాల్గొన్నారు.


ఇన్‌చార్జీ డీడీని సన్మానిస్తున్న గిరిజన సంక్షేమ నాలుగో తరగతి ఉద్యోగులు

ఐటీడీఏ ఇన్‌చార్జి డీడీగా జాదవ్ వసంత్

ఉట్నూర్, ఆగస్టు 2: ఉమ్మడి జిల్లా ఐటీడీఏ ఏపీవో జనరల్ జాదవ్ వసంత్ ఇన్‌చార్జీ డీడీగా బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఉన్న డీడీ దిలీప్ కుమార్ హైదరాబాద్‌లోని గిరిజన సంక్షేమ శాఖ కమిసనర్ కార్యాలయానికి బదిలీ కావడంతో ఆయన స్థానంలో ఎవరిని నియమించక పోవడంతో జిల్లా అధికారులు ఇన్‌చార్జీ డీడీగా జాదవ్ వసంత్‌ను నియమించారు. బాధ్యతలు స్వీకరించిన డీడీని గిరిజన సంక్షేమ శాఖ అధికారులతో పాటు జిల్లా గిరిజన సంక్షేమ శాఖ నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం నాయకులు కేబీసీ నారాయణరావు ఆధ్వర్యంలో సన్మానించారు. ఆయన వెంట జిల్లా అధ్యక్షుడు షౌకత్‌హుస్సేన్, జాదవ్‌బొజ్జు, కె.బొజుజ, భగవంతురావు, నితిన్, కమలబాయి, ఈరమ్మ, రంభబాయి, రాందాస్, తదితరులున్నారు.

రిమ్స్‌లో మరిన్ని మెరుగైన వైద్య సేవలు

ఆదిలాబాద్ రూరల్, ఆగస్టు 2: ఆదిలాబాద్‌లోని రిమ్స్‌లో నాణ్యమైన వైద్య సేవలు అందించే దిశగా పటిష్ట చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ రాజార్షిషా తెలిపారు. రిమ్స్‌లో శస్త్ర చికిత్సల సమయంలో వినియోగించేందుకు రాజస్థాన్‌లోని ఉదయపూర్‌కు చెందిన జీఆర్ ఇన్ఫ్రాసోషల్ వెల్ఫేర్ ట్రస్ట్ సామాజిక బాధ్యతలో భాగంగా రూ.25 లక్షల వ్యయంతో పరికరాలను అందుబాటులోకి తీసుకు వచ్చారు. కాగా వాటిని శుక్రవారం డైరెక్టర్ జైసింగ్ రాథోడ్, సూపరింటెండెంట్ అశోక్‌లతో కలిసి కలెక్టర్ ప్రారంభించారు. వైద్యానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని బాధితులు వినియోగించుకోవాలన్నారు.

నేరడిగొండ పశువైద్యాధికారిగా జీవన్

నేరడగొండ, ఆగస్టు 2: సాధారణ బదిలీలలో భాగంగా నేరడిగొండ ప్రభుత్వ పశువైద్యా ధికారిగా డాక్టర్ జీవన్‌రాథోడ్ శుక్రవారం బాధ్యతలు చేపటారు. వెటర్నరీ అసిస్టెంట్‌గా పని చేసిన అనిత, నిర్మల్‌జిల్లాకు బదిలీ కాగా ఆమె స్థానంలో నరేందర్ వెటర్నరీ అసిస్టెంట్‌గా నిర్మల్ నుంచి బదిలీ పై వచ్చారు. అదేవిధంగా తర్నంలో డిప్యూటేషన్ ఆధారంగా పని చేసిన విజయలక్ష్మి జేవీవో నిర్మల్ జిల్లాకు బదిలీ అయ్యారు. ఆమె స్థానంలో వెంకన్న వీఎల్‌వో నిర్మల్ జిల్లా నుంచి తర్నం పశువైద్యశాఖకి బదిల ఈయ్యారు. ఇంత వరకు నేరడిగొండ మండల పశువైద్య అధికారిగా పని చేసిన డా. సుశీల్ వీఏఎస్ వాంకిడి పశువైద్యశాల బాధ్యతలను స్వీకరించడం జరిగింది.

హైదరాబాద్‌కు తరలిన ఉపాధ్యాయులు

ఆదిలాబాద్ రూరల్, ఆగస్టు 2: ఉద్యోగోన్నతి పొందిన ఉపాధ్యాయులు శుక్రవారం తెల్లవారుజామున హైదరాబాద్‌కు బయలదేరి వెళ్లారు. కాగా, సాయంత్రం ఎల్బీ స్టేడియంలో జరిగే బహిరంగ సభలో సీఎం రేవంత్‌రెడ్డి పాల్గొనున్నారు. ఇటీవల జిల్లాలో 430 మంది ఎస్జీటీ, పండిత, పీఈటీలకు ఉద్యోగోన్నతులు లభించిన సంగతి తెలిసిందే. ఈ మేరకు ఏర్పాటు చేసిన అభినందన సభకు ఉపాధ్యాయులను ప్రత్యేక బస్సుల్లో హైదరబాద్ పంపించినట్లు డీఈవో ప్రణీత తెలిపారు.


హైదరాబాద్‌కు తరలి వెళ్తున్న ఉపాధ్యాయులు